
# ఆఫీసరుగారి భార్య

● వడ్లమూడి దుర్గాంబ




"రేపు మా ప్రతిమ బర్త్‌డే పార్టీ కదా! తన ఫ్రెండ్స్‌ని పిల్చివస్తానని వెళ్ళింది." "ప్రతిమ ఇంట్లో లేదా" అని అడిగిన పక్కింటావిడకి వాకిట్లో నిలబడి సమాధానం చెబుతోంది అరుణ. "మా వారి పై ఆఫీసర్‌గారమ్మాయి మా ప్రతిమకి క్లోజ్ ఫ్రెండ్! ఒక్కక్షణం దీన్ని వదిలి వుండదటండీ, ఆ అమ్మాయి. ఆ పిల్లని పిల్చివస్తాననే వెళ్ళింది" ఆవిడ అడగని సమాచారం కూడా ఆమె నోటి వెంట రాకుండా ఆగలేకపోతోంది.

ఒక్కగానొక్క కూతురి పుట్టినరోజు ఉత్సాహంకంటే – ఆమె గొంతులో, ఆఫీసర్‌గారమ్మాయితో తమ కూతురి స్నేహం గురించి చెప్పాలన్న తపనే ఎక్కువగా వుంది. అది గమనించే కాబోలు ఆ పక్కింటావిడ పెదాలచాటున, కనబడీ కనబడనట్టుగా ఓ చిన్న నవ్వు విరిసింది. ఆ నవ్వునీ, అందులోని వ్యంగ్యాన్నీ గమనించే స్థితిలో మాత్రం అరుణ లేదు.

ఆమె అక్కడ మాట్లాడుతుండగానే రోడ్డు చివర కనబడింది ప్రతిమ. మొహం నేలకు వేలాడేసుకుని నడుస్తోంది, అదీ నిదానంగా. ఇంటి దగ్గర నుంచీ బయలు దేరిన ప్రతిమకీ, ఇంటికి తిరిగివస్తున్న ప్రతిమకీ చాలా తేడా వుంది. కారణమేమిటో చూచాయగా మనసుకి తోచింది అరుణకి. అంతే! "వస్తానండీ చాలా పనుంది" అంటూ వెనకాల ఆవిడ ఏదో అంటున్నా పట్టించుకోకుండా గబగబా ఇంట్లోకి నడిచింది అరుణ.

ప్రతిమ రోడ్డు చివరనుంచీ ఇంట్లోకి అడుగు పెట్టేవరకూ ఆ రెండు నిముషాలే ఆగలేకపోయింది ఆమె. ఆ పిల్ల ఇంట్లో కాలు పెట్టక ముందే అడిగేసింది. "ఏంటే! అలావున్నావ్ రమ్య ఇంట్లో లేదా!" తను అనుకున్నది కాకుండా అలాజరిగితే బాగుండునని కాబోలు ఆమెనోటి వెంట ఆమాట వచ్చింది.

"ఉందమ్మా! ముందు నేను నా బర్త్‌డే పార్టీ – నువ్వురావాలి! అని చెప్పగానే 'వస్తాను' అని కూడా అంది. కానీ వాళ్ళ మమ్మీనే –" ఆగింది ఆ అమ్మాయి. "ఆమెకి భలే గర్వమమ్మా" పన్నెండేళ్ళ ఆ పిల్ల అక్కడ జరిగిన విషయాన్ని ఒక్క మాటతోనూ, ఒక్క ముఖకవళికతోనూ తల్లికి పూర్తిగా అర్థమయ్యేలా చెప్పగలిగింది.


కూతురు చెప్పేది అర్థమవుతున్నా – ఆ ఆఫీసర్ గారి భార్య, తన కూతుర్ని ఏమేం మాటలనేసిందో అనే ఆత్రుతతోనూ – ఆరాటంతోనూ, "ఏం జరిగింది సరిగ్గా చెప్పు" అంది అరుణ.

"ముందు నన్ను చూడగానే బాగానే మాట్లాడింది. ఇలా రమ్యని పార్టీకి పిలుద్దామని వచ్చానాంటీ – అనగానే "ఎవరమ్మాయివి నువ్వు?" అంది. నాన్నగారి పేరు, ఏం పని చేస్తారో అంతాచెప్పాను. అంతే – నా పక్కన కూర్చున్నదల్లా పైకి లేచి ఏమిటీ, నువ్వు 'అటెండరు రామదాసు కూతురివా' అంది, ఆశ్చర్యంగా. 'ఇప్పుడు మా నాన్నగారు క్లర్క్ అయ్యారు' అన్నాన్నేను. ఓ క్షణం ఆగింది ప్రతిమ, ఊపిరి పీల్చుకోడానికి కాదు, మాటలతో పాటు ఉబికి వస్తున్న ఏడుపుని ఆపడానికి అని అర్థమయింది అరుణకి.

"అవున్లే ఈ మధ్య రాందాసు గుమాస్తా అయ్యాడని విన్నాను. అయినా నిన్ను చూస్తే ఓ గుమస్తా కూతుర్లా అనిపించట్లేదే' – అని – ఆ అవునూ పార్టీ రేపన్నావ్ కదూ, మా రమ్యకి రావడానికి కుదరదు. తెలిసిన వాళ్ళింటికి వెళ్ళాలి. ఏం అనుకోకూ – ఇంకవెళ్ళు' అందమ్మా". అప్పటికే ఆ అమ్మాయి కళ్ళనిండా నీళ్ళు – ఇంకా చెప్పడం అయిపోలేదు అన్నట్టుగా ఆ పిల్ల మొహంలో ఇంకా ఉద్విగ్నత. అరుణ తన కోపాన్ని మౌనంలోకి దిగమింగుకుని వింటోంది.

"నా కర్చీఫ్ సోఫాలో పెట్టి మర్చిపోయాను, తెచ్చుకుందామని మళ్ళీ వెళ్ళాను. అప్పుడంటోంది ఆమె..."వెక్కిళ్ళు పడుతోంది ప్రతిమ. " 'ఆపిల్ల ఎవరనుకున్నావ్! మనింటికి కూరగాయలు మోసి, మనబట్టలుతికి పెట్టిన అటెండర్ రాందాసు కూతురు! ఇప్పుడేదో గుమస్తా అయినంత మాత్రాన స్టేటస్ పెరిగిపోతుందా! ఆ పిల్ల నిన్ను, ఏమే రమ్యా! అని పిలవడమా! వాళ్ళ నాన్న నన్ను 'అమ్మగారూ' అని పిలిస్తే ఈ పిల్ల ఆంటీ అంటుందా! ఇంకెప్పుడన్నా దాంతో స్నేహం చేసినట్టు తెలిస్తే చంపేస్తాను' అని రమ్యని

30-9-94 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక




తిడుతోంది. ఇంకనేను లోపలికి కూడా వెళ్ళలేదు అలాగే వచ్చేసారు." మంచంమీద పడుకుని దిండులో తలదూర్చి ఏడుస్తోంది ప్రతిమ.

తన తండ్రిని తనముందే చిన్న బుచ్చి మాట్లాడినందుకో – ఇన్నాళ్ళూ తనతో స్నేహం చేసిన తన నేస్తం ఇకమాట్లాడదేమో అనే బెంగో – తనకు అవమానం జరిగిందనే బాధో – ఏడుస్తోంది కానీ – తన ఏడుపుకి సరైన అర్థం తెలుసుకునే వయసే ప్రతిమకి లేదు.

కానీ అరుణకి అర్థమైంది బాగా.

ఆ ఆఫీసర్ గారి భార్య మనస్తత్వం తనకు బాగా తెలుసు. ప్రతిమ వాళ్ళింటికి వెళ్ళిన దగ్గర్నించి అనుమానంగావే వుంది తనకు. ఆమె పొగరు, అహంకారం అన్నీ తన భర్తద్వారా వినివుంది. ఒక మగవాడు అనైనా చూడకుండా, అన్ని పనులూ చేయించేదట! చాలా అవమానకరంగా మాట్లాడేదట. ఇంటికి వచ్చి తెగబాధపడేవాడు.

ఏదో పరిస్థితుల వల్ల అలా చేయవలసి వచ్చింది గానీ – ఆయనేం చదువుకోనివాడు కాదు – డిగ్రీ చదివాడు. దేవుడి దయవలన ప్రమోషనొచ్చి ఆ నరకంలోంచి బయట పడ్డాడు, అనుకుంటుంది ఎప్పుడూ తను.

అయితే – ఒకప్పుడు తన ముందు చేతులు కట్టుకుని నిలబడి నంత మాత్రాన ఎప్పటికీ అలాగే వుండాలా! ఆమెకి డబ్బున్నంత మాత్రాన ఎదుటి మనిషిని అలా తక్కువ చేసి మాట్లాడుతుందా!

డబ్బు లేనంత మాత్రాన తాము మరీ ఆత్మాభిమానం లేని వాళ్ళమను కుంటుందేమో! దీని కూతురు వస్తే ఎంత! రాకపోతే ఎంత!

అతికష్టం మీద, అవమానాన్నీ, బాధనీ, తన కూతురి పుట్టినరోజు పార్టీకి ఆఫీసర్ గారమ్మాయి రావడంలేదే – అనే అసంతృప్తినీ అన్నింటినీ అదిగమించి మనసుకి సర్దిచేప్పకుంది అరుణ. ఆ తరువాత కూతురికి కూడా సర్దిచెప్పడానికి ప్రయత్నించింది.

"చూడమ్మా ప్రతిమా! ఆవిడ పుట్టే డబ్బుమనిషి! స్టేటస్ అంటే పడి చస్తుంది! ఉన్న వాళ్ళ కుక్కనయినా నెత్తికెక్కించుకుంటుంది." తల్లి ఆ మాటనగానే ప్రతిమ పకపకా నవ్వింది. ఆ పిల్ల మొహం కొంచెం తేటబడింది. అరుణ మనసు తేలిక పడింది.

"అసలు మన పార్టీకి వచ్చే అర్హత వాళ్ళకేలేదు. మనమే వాళ్ళని పిలవం" కూతురి మనసులోని మాటలకి తనే అక్షరరూపం ఇచ్చి చెప్పింది అరుణ.


"అవునమ్మా! వాళ్ళు మంచి వాళ్ళు కాదు. మనుషుల్ని, మనుషులుగా చూడరు" ప్రతిమ మొహంలో వాళ్ళపట్ల ఛీత్కారభావం. అరుణ ఆశ్చర్య పోయింది. తను ఇంతసేపూ చెప్పిందంతా ప్రతిమ ఎంతబాగా అర్థం చేసుకోగలిగింది. "ఏమైనా నా తల్లి భలే తెలివైంది.' సంబరపడిపోయింది అరుణ.

తల్లీ కూతుళ్ళిద్దరూ మళ్ళీ పార్టీ హడావుడిలో పడ్డారు. ఇల్లు ఎలా అలంకరించాలి. ఎలాంటి కేక్ తేవాలి! మొదలైన వన్నీ మాట్లాడుకోసాగారు.

సాయంత్రం చీకటి పడుతుండగా అరుణ మళ్ళీ ఓ సారి అడిగింది. "ప్రతిమా! నీ ఫ్రెండ్స్‌నందర్నీ పిలిచినట్టేనా! ఎవర్నీ మరచిపోలేదు కదూ!" ప్రతిమ ఆలోచనలో పడింది. "ఇంకనేను పోయొస్తనమ్మా!" అంట్లుతోమి పైట చెంగుతో చేతులు తుడుచుకుంటూ బయటకు వెళ్తోంది వెంకమ్మ. అరుణ ఇంట్లో పని మనిషి.

ఆమె అటు వెళ్ళగానే అప్పుడే గుర్తొచ్చినట్టు పరిగెత్తుకొచ్చింది ప్రతిమ తల్లిదగ్గరకు. "అమ్మా! మర్చిపోయానే! మన వెంకమ్మ కూతురు ప్రభావతి లేదూ! ఆ అమ్మాయిని పిలవలేదే! పాపం ఆ అమ్మాయి నన్ను అడిగింది కూడా తెలుసా! 'నీ పుట్టిన రోజంటగా మా అమ్మ చెప్పింది నన్ను పిలవ్వా' అని – అమ్మా! వెంకమ్మ వెళ్ళిపోతోంది. ఆమె వెంట వెళ్ళి ప్రభావతికి చెప్పి వస్తానే..." హుషారుగా, పరిగెత్తడానికి సిద్ధంగా వున్న కూతురి చేయిపట్టి గబుక్కున ఆపేసింది అరుణ.

"నీమొహం! నోర్మూసుకో! ఆ పిల్లని పిలవడమేంటి. నీకు రానురానూ మరీ బుద్ధిలేకుండా పోతోంది. ఆ పిల్లతోనా స్కూల్లో నీ స్నేహం! మండి పట్టేవుంది తెలివి–" అరుణ తిడుతూనే వుంది. ప్రతిమ నిశ్చేష్టురాలై వింటోంది. ఆ పిల్లకి తల్లిలో హఠాత్తుగా ఆఫీసరుగారి భార్య రూపం కనబడింది. అంతే! షాక్ కొట్టినట్టుగా తల్లి చేతిలోంచి తన చేతిని విదిలించుకుని దూరంగా పరిగెత్తింది. ○



## నాలోని నీవు

చూపుల తూపులతో
ఎదపై దాడి చేద్దామంటే
పువ్వులా నవ్వి నన్ను కరిగిస్తావ్!
నల్ల మబ్బుల కోపంతో
వర్షించి నిన్ను ముంచేద్దామంటే
మయూరమై ఆడి, నన్ను కట్టేస్తావ్!
చీకటి భూతాన్ని చూపించి
భయం గుప్పిట్లో నిన్ను పట్టేద్దామంటే
వెలుగు శిఖరాలపై నిల్చొని పలకరిస్తావ్!
నేస్తం...
లోకానికి నిన్ను చూపిద్దామంటే
నాలో లీనమై ఒదిగిపోతుంటావ్!!

— "కిరణ్‌ప్రభ"

## వాల్ ఆఫ్ ఎర్త్

అమెరికాలోని రియోడిజనోరో పురపాలక సంఘంవారు వాతావరణ కాలుష్యాన్ని నిరోధిం చేందుకు తమవంతు ప్రయత్నాలని ప్రారంభిం చారు. ఇందుకు కావలసిన నిధులు సేకరించేందుకు వీరు బ్రహ్మాండమైన గోడ నొక దాన్ని నిర్మించారు. కిలోమీటరు పైగా పొడవున్న ఈ గోడ పేరు "వాల్ ఆఫ్ ఎర్త్". పుడమి తల్లి పచ్చగా ఉండాలని కోరుకునేవారు ఎవరైనా ఈగోడమీద చెరిగిపోని సంతకాన్ని చేయవచ్చు. అది ఆ గోడమీద శాశ్వతంగా నిలిచిపోతుంది. అయితే దీనికి వంద డాలర్ల ఫీజు చెల్లించాలి.